ఏ పార్టీకి ఎన్ని ఓట్లు? ఎన్ని సీట్లు?

తిగుళ్ల కృష్ణమూర్తి

తెలంగాణలో ఈసారి ఎన్నికలు చాలా టిపికల్‌గా కనిపించాయి. 30 ఏండ్ల నా కెరీర్‌లో నేను అనేక ఎన్నికల్ని దగ్గర్నుంచి పరిశీలించాను. కానీ ఓటరు ఇంత నిగూఢంగా వ్యవహరించిన సందర్భం ఇంతకుముందు లేదు. పలు నియోజకవర్గాల్లో తిరిగినప్పుడు, ఓటరు నాడి పసిగట్టలేని స్థితిని నేను ప్రత్యక్షంగా చూశాను. ఎందుకో వారు చాలా గుంభనంగా ఉన్నారు. మనసులో మాట బయటపెట్టడానికి ఇష్టపడలేదు.

‘ఎవరికి ఓటేస్తావు?’ అని అడిగిన ప్రశ్నకు ‘నువ్వెవరికి వేస్తవ్?’ అన్న ఎదురుప్రశ్నే చాలాసార్లు జవాబైంది. ‘నువ్వెవలికేస్తే నేను ఆళ్లకే ఏస్తా’ అనేది బాగా వినిపించిన మరో గడుసు జవాబు. ‘నేను కాంగ్రెస్‌కు ఓటేస్తా’ అని స్పష్టంగా చెప్పినా కూడా, రాష్ట్రంలో ప్రభుత్వం ఎవరు ఏర్పాటు చేస్తారంటే ‘కేసీఆరే’ అని నిర్మొహమాటంగా అనేకమంది చెప్పడం మరో విచిత్రం. ఇవన్నీ చూస్తే ఒక కన్ఫ్యూజన్, గందరగోళమేదో క్షేత్రస్థాయిలో ఉన్నట్టు అనిపించింది.

పదేండ్ల ప్రభుత్వంపై తప్పనిసరిగా ఎంతోకొంత వ్యతిరేకత ఉంటుందనే భావనకు విరుద్ధంగా, కేసీఆర్ పాలన, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి బాగున్నాయనే మాట అందరి నోటా, చివరికి కాంగ్రెస్ నాయకుల నోటి నుంచి కూడా వినిపించింది. అయితే ‘అభివృద్ధి– సంక్షేమం’ అనే రెండు అంశాలకు పైబడి ఇంకేదో ఓటర్లను కొంత ప్రభావితం చేసింది. అది స్థానిక నాయకులపై ఏర్పడిన వ్యతిరేకత కావచ్చు. ‘పైన సారు మంచిగనే ఉన్నడు. కింద మేం మంచిగనే ఉన్నం. మధ్యల ఉన్నోళ్లతోటే ఉన్నది పరేషానంతా’ అని కేటీఆర్ నిర్వహించిన సభలోనే ఒక పెద్దాయన ఆక్రోశం వెళ్లగక్కాడు. ఈ అసంతృప్తే ఓటరును కొంత గందరగోళానికి గురిచేసి ఉండవచ్చు. ఎందుకంటే పోలింగ్‌కు ముందున్న ఈ అయోమయం ఓటింగ్ ముగిసి, ఎగ్జిట్‌పోల్స్ వెలువడ్డ తర్వాత కూడా పోలేదు. ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు చూసిన అనేకమంది, ‘ఇదేంటి.. ఇట్లా వస్తున్నాయి?’ అని వాటిని తాము ఊహించలేదన్నట్టుగా ఆశ్చర్యపోయారు. ‘గిట్లైతే కరెంటెట్ల? ఉంటదా?’ అని హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన ఒక నడి వయస్కురాలు (కాంగ్రెస్ ఓటరు) ఆందోళన చెందితే, ‘మల్ల పగటిపూట యాపచెట్ల కింద పండాలె. రాత్రిపూట అంగీలిడ్సి పండాలె. గంతే అయితదా ఏంది?’ అని ఇంకో 50 ఏండ్ల ప్రైవేటు టీచర్ (బీఆర్‌ఎస్ ఓటరు) అనుమానపడ్డాడు. పదేండ్ల తెలంగాణ రాష్ట్రంలో ఇది మూడో ఎన్నిక. ‘తెలంగాణ తెచ్చిన పార్టీకే ఓటు’ అనే లెక్కన మొదటి ఎన్నిక జరిగితే, ‘సంక్షేమం ఇచ్చిన సారుకే ఓటు’ అన్నట్టు రెండో ఎన్నిక జరిగింది. మూడో ఎన్నిక మాత్రం, ముందు క్షేత్రస్థాయిలో లెక్కలు సరిచూసుకుందాం అన్నట్టుగా సాగినట్టుంది. మరోమాటలో చెప్పాలంటే ఈసారి ‘క్యాండిడేట్ బేస్డ్ ఎలక్షన్’ జరిగినట్టు కనిపిస్తున్నది. క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులు, వారి పనులు, వారి పట్ల ఉండే ఇష్టాయిష్టాల ఆధారంగా ఓటరు నిర్ణయం తీసుకున్నట్టు అనిపిస్తున్నది. అదే సమయంలో సారు ఎలాగైనా అధికారంలోకి వస్తాడని ఓటరు నమ్మాడు. వారి నమ్మకం నిజమవుతుందా? ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు నిజమవుతాయా? లేదా అంతకుమించిన లోగుట్టు ఏదైనా ఉందా? ఇదీ ఇప్పుడు అసలు ప్రశ్న. ఇండియాటుడే బోర్డ్ రూమ్‌లో జరిగిన చర్చ వీడియో క్లిప్ ఒకటి సోషల్‌మీడియాలో కనిపించింది. అందులో కూడా ప్రముఖ సెఫాలజిస్టు ప్రదీప్ గుప్తా, రాహుల్ కన్వల్, రాజ్‌దీప్ సర్దేశాయ్‌లు తెలంగాణ ఫలితం ఎట్లా ఉంటుందన్నదానిపై తల పట్టుకోవడం కనిపించింది. ఎన్నికల్ని, ఓటింగ్ సరళిని నిశితంగా పరిశీలించే అనుభవజ్ఞులు చెప్పే విశ్లేషణలు, పోలింగ్ తర్వాత వేసిన అంచనాల మేరకు, లాజికల్‌గా ఉన్నాయన్న అంశాలను నేను ప్రస్తావిస్తాను.

2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ఎన్నికలు జరిగాయి. అందువల్ల నిర్దిష్టమైన సంఖ్యలు లేవు. అయితే ఆ ఎన్నికల్లో తెలంగాణలో 69 శాతం పోలింగ్ జరిగింది. బీఆర్‌ఎస్ (టీఆర్‌ఎస్)కు 33.83 శాతం ఓట్లు, కాంగ్రెస్‌కు 25.02 శాతం ఓట్లు వచ్చినట్టు ఒక అంచనా. ఈ శాతాలకు అనుగుణంగానే ఆనాడు బీఆర్‌ఎస్ (టీఆర్‌ఎస్)కు 63 సీట్లు, కాంగ్రెస్‌కు 21 సీట్లు వచ్చాయి. ఇక 2018లో కేసీఆర్ సంక్షేమ పథకాలు, రైతుబంధు వల్ల ఒక వేవ్ ఏర్పడింది. పోలింగ్ బాగా పెరిగి 73.74 శాతంగా నమోదైంది. బీఆర్‌ఎస్‌కు, కాంగ్రెస్‌కు కూడా ఓట్లు పెరిగాయి. బీఆర్‌ఎస్‌కు 46.87 శాతం ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 28.43 శాతం ఓట్లు వచ్చాయి. (అప్పుడు కాంగ్రెస్.. టీడీపీ, సీపీఐ, సీపీఎం, సమితి పొత్తు పెట్టుకున్నాయి) అంటే రెండు పార్టీల మధ్య తేడా 18.44 శాతం. ఇది చాలా పెద్ద అంతరం. దీనికి అనుగుణంగానే నాడు బీఆర్‌ఎస్‌కు 88 సీట్లు రాగా, కాంగ్రెస్ కేవలం 19 సీట్లకు పరిమితమైంది. నాడు బీజేపీకి 6.98 శాతం, అంటే దాదాపు 7 శాతం ఓట్లు వచ్చాయి. ఇది గతం.

ఇప్పుడు వర్తమానానికి వద్దాం. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావాలంటే, బీఆర్‌ఎస్‌కన్నా ఎక్కువ ఓట్లను పొందాల్సి ఉంటుంది. (ఓట్లు తక్కువ వచ్చి, సీట్లు ఎక్కువ గెల్చుకున్న సందర్భాలు కూడా కొన్ని ఉన్నాయి. కానీ అవి చాలా అరుదు.) అంటే గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు అదనంగా పడ్డ 18.5 శాతం ఓట్లలో కనీసం పది శాతాన్ని కాంగ్రెస్ లాక్కోవాల్సి ఉంటుంది. సునామీలా ఓట్లు పడి, పోలింగ్ శాతం భీకరంగా పెరిగినప్పుడు మాత్రమే 10 శాతం స్వింగ్ సాధ్యమవుతుందనేది సెఫాలజిస్టుల లెక్క. అంటే ఒక వేవ్ రావాలన్న మాట. ఇందిరాగాంధీ దారుణ హత్య తర్వాత జరిగిన ఎన్నికల్లో అలాంటి వేవ్ ఉంది. రాజీవ్‌గాంధీ హత్య తర్వాత కూడా అలాంటి వేవ్ కనిపించింది.2018లో తెలంగాణలో, ఆంధ్రాలో కూడా కొంత వేవ్ కనిపించింది. అందువల్లే అప్పుడు ఓటింగ్ శాతాలు పెరిగాయి. మరిప్పుడు వేవ్ ఎక్కడుంది? వేవ్ మాట అటుంచితే, 2018తో పోలిస్తే ఓటింగ్ 3 శాతం దాకా తగ్గింది. ఇలాంటప్పుడు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌కు (కనీసం) పది శాతం స్వింగ్ సాధ్యమవుతుందా? ఇదీ సెఫాలజిస్టుల సందేహం.

స్వింగ్ జరగకున్నా, అధికార పార్టీకి ఉన్న ఓట్లశాతం అట్లాగే ఉన్నా ఓడిపోయే అవకాశం లేదా? అన్నది మరో సందేహం. కచ్చితంగా ఉంది. కర్ణాటకలో అదే జరిగింది. కర్ణాటకలో బీజేపీకి 2018లో 36.35 శాతం ఓట్లు రాగా, 2023లో కూడా 36 శాతమే ఓట్లు వచ్చాయి. అయినా అది ఓడిపోయింది. అయితే అక్కడి పరిస్థితి వేరు. అక్కడ జేడీఎస్ ఓట్లలో మేజర్ షేర్ (4.74 శాతం)ని కాంగ్రెస్ గుంజుకుంది. 2018 ఎన్నికల్లో కర్ణాటకలో కాంగ్రెస్‌కు 38.14 శాతం ఓట్లు, జేడీఎస్‌కు 18.3 శాతం ఓట్లు రాగా... 2023లో జేడీఎస్ ఓట్లు 13.29 శాతానికి తగ్గి, కాంగ్రెస్ ఓట్లు 42.88 శాతానికి పెరిగాయి. జేడీఎస్ నుంచి ఓటు బదిలీ అయిందనడానికి ఇదే నిదర్శనం. అందువల్లే కర్ణాటకలో కాంగ్రెస్‌ది పైచేయి కాగలిగింది. అధికారంలోకి రాగలిగింది. మరి తెలంగాణలో ఆ పరిస్థితి ఉన్నదా? ఇక్కడ బీఆర్‌ఎస్ ఓటును కాంగ్రెస్ కొంతవరకు చేజిక్కించుకున్నదే అనుకున్నా, బీఆర్‌ఎస్‌పై పూర్తి ఆధిక్యం సాధించడానికి ఇంకెవరి ఓటును రాబట్టుకోగలుగుతుంది? బీజేపీ ఓటు బ్యాంకు ఎంతో కొంత పెరిగిందే తప్ప తరగలేదని సర్వేలు సూచిస్తున్నాయి. మరో లాజిక్ ఏమిటంటే, 2018లో అధికారికంగా కాంగ్రెస్‌తో ఉన్న టీడీపీ, సీపీఎం ఇప్పుడు పూర్తిగా లేవు. ఈ క్రమంలో ఎవరి ఓట్లు తీసుకుని కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ను దాటే స్థాయికి వెళ్తుంది? ఇది సాధ్యమా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, అభివృద్ధి కుంటుపడిందని అక్కడి ప్రజలు రెండేండ్ల ముందే గుర్తించారు. బీజేపీపై తీవ్ర వ్యతిరేకత కూడా ఏర్పడింది. అయినా దాని ఓటు శాతం చెక్కు చెదరలేదు. కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణను అభివృద్ధి చేసిందనే విషయాన్ని ప్రజలు, ప్రత్యర్థులు సైతం నిర్ద్వంద్వంగా అంగీకరిస్తున్నారు. అలాంటప్పుడు, వేవ్ ఏదీ లేని ఈ సమయంలో, బీఆర్‌ఎస్ ఓట్ల శాతం మరీ భారీగా, అంచనాలకు అందనంత ఎక్కువగా తగ్గేందుకు ఆస్కారమే లేదన్నది ఇంకొక అంచనా. వేవ్ లేకున్నా, బీఆర్‌ఎస్ నుంచి కనీసం పది శాతం ఓటు కాంగ్రెస్‌కు స్వింగ్ అయిందే అనుకుందాం. అప్పుడు కూడా కాంగ్రెస్ (38.5 శాతం)కు బీఆర్‌ఎస్ (37 శాతం) కంటే కేవలం 1.5 శాతం ఓట్లు మాత్రమే ఎక్కువగా ఉంటాయి. అంటే 3.46 లక్షల ఓట్లు అన్నమాట. వీటిని 119 నియోజకవర్గాలకు పంచితే 2,911 ఒక్కో స్థానంలో బీఆర్‌ఎస్‌కన్నా కాంగ్రెస్‌కు అదనంగా వచ్చే ఓట్లు. వీటితోనే కాంగ్రెస్ సింపుల్ మెజారిటీ సాధిస్తుందా? అన్నదానిపై సెఫాలజిస్టుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

నా మిత్రుడొకరు సోషల్ మీడియాలో పెట్టినట్టు, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని 29 సీట్లలో బీఆర్‌ఎస్ 15 దాకా గెలిచే అవకాశం ఉంది. 6-7 సీట్లు మజ్లిస్‌కు దక్కవచ్చు. కాంగ్రెస్‌కు మూడు నాలుగు రావొచ్చంటున్నారు. కాంగ్రెస్‌కు సింపుల్ మెజారిటీ రావాలంటే, మిగతా ఎనిమిది ఉమ్మడి జిల్లాల్లోని 90 సీట్లలో కనీసం 56 గెలుచుకోవాల్సి ఉంటుంది. ప్రతి జిల్లాలో సగటున 7 సీట్లు గెలుచుకోవాలి. అంటే దాదాపు 66 శాతం స్ట్రైక్ రేట్ ఉండాలి. లేదా 56 సీట్ల మేరకు కొన్ని జిల్లాలను పూర్తిగా స్వీప్ చేయాలి. కాంగ్రెస్ బలం అంత పెరిగిందా? బీఆర్‌ఎస్ అంత బలహీనపడిందా? అంటే క్షేత్రస్థాయి లెక్కలు కాదనే అంటున్నాయి. క్యాడర్‌పరంగా కానీ, పోల్ మేనేజ్‌మెంట్‌పరంగా గానీ, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులైన ఓటర్లపరంగా కానీ బీఆర్‌ఎస్సే ముందున్నదనేది ప్రత్యర్థులు సైతం కాదనలేని వాస్తవం. మహబూబ్‌నగర్ జిల్లా మన్యంకొండ వద్దకు వెళ్లినప్పుడు జహీనాబీ అనే ఒక నడివయస్కురాలు అన్నమాట చాలా కీలకం. ‘ఓటరు కారుకున్నడు. లీడర్ కాంగ్రెస్‌కున్నడు’ అని ఆమె ఒక్కముక్కలో తేల్చేసింది.

నిజాలు ఇట్లుంటే, ఎగ్జిట్‌పోల్స్ పేరుతో నలుగురి ముందు మైకులు పెట్టి, వారి అభిప్రాయాలను తీసుకుని, అవే ప్రామాణికమని నమ్మి లేదా నమ్మించడానికి ప్రయత్నించడం విడ్డూరం. అభిప్రాయం చెప్పిన వారిని మాత్రమే ఎగ్జిట్‌పోల్ పరిగణనలోకి తీసుకుంటుంది. మరి చెప్పనివారి సంగతి? తప్పుదోవ పట్టించినవారి సంగతి? అదీగాక.. చిన్నా చితక సంస్థలు ఇప్పుడు చేస్తున్న సర్వేల్లో, ఎంత ఎక్కువ శాంపిల్ ఉంటే అంత గొప్ప అన్నట్టుగా తయారయ్యాయి. విశేషం ఏమిటంటే, శాంపిల్ ఎంత ఎక్కువైతే అంత ఎర్రర్ రేట్ కూడా పెరుగుతుంది. అందువల్లే ఎర్రర్‌రేట్‌ను కూడా పరిగణించి, పరిహరించే సైంటిఫిక్ సర్వేలు మాత్ర మే కొంతలో కొంత వాస్తవానికి దగ్గరగా ఉంటాయి. ఇండియా టుడే సర్వే కూడా చాలా అసంబద్ధంగా కనిపించింది. వాళ్లు దక్షిణ తెలంగాణగా భావించిన రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల అన్నింటిలో కలిపి బీఆర్‌ఎస్‌కు 6 సీట్లు మాత్రమే వస్తాయని ఇండియా టుడే చెప్పింది. కానీ, నల్లగొండను పక్కన పెడితే కేవలం మహబూబ్‌నగర్‌లో 6, రంగారెడ్డిలో 6 సీట్లు వచ్చే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. బీఆర్‌ఎస్ ఓటు కొంతవరకు తగ్గుతున్నందున మెజారిటీలు పడిపోయే అవకాశం ఉంది. తక్కువ మెజారిటీలు ఉండే సమయంలో అంటే నెక్ టు నెక్ పోటీలో ఫలితాలను సర్వే సంస్థలు పసిగట్టలేవన్నది ఇప్పటికే రుజువైన నిజం. అలాగే తెలంగాణ ఓటరు కూడా తమిళనాడు ఓటరంత తెలివిగా, నిగూఢంగా వ్యవహరించిన ఈ ఎన్నికలో ఫలితాన్ని అంచనా వేయడం అంత సులువుకానేకాదు. ఇండియా టుడే తన సర్వేలో 2018లో కాంగ్రెస్‌కు అది పోటీచేసిన సీట్లలో వచ్చిన ఓట్ల శాతాన్ని ప్రామాణికంగా తీసుకుని, దానికి ఇప్పుడు బదిలీ అయ్యే ఓటును జమచేసింది. మరి కాంగ్రెస్ ఓటులో ఉన్న తెలుగుదేశం ఇతర మిత్రపక్షాల ఓటును మైనస్ చేయలేదు. అలాంటప్పుడు ఈ లెక్క ఎలా కరెక్ట్ అవుతుంది? ఇండియా టుడే అంచనా వేసినట్టు 20-25% ఓటు ట్రాన్స్‌ఫర్ జరగడానికి కేసీఆర్ ప్రభుత్వం అంత పెద్ద తప్పులేం చేయలేదు. అందువల్ల వేవ్ అనేది దాదాపు అసాధ్యం. ఉంటే గింటే క్రాస్ ఓటింగ్ ఎంత జరిగింది? ఏ పార్టీ నుంచి ఏ పార్టీకి జరిగింది? అంచనాలకు అందని సైలెంట్ ఓట్ ప్రభావం ఎంత? పెరిగిన బీజేపీ ఓట్లు ఏ నియోజకవర్గంలో ఏ పార్టీకి నష్టం చేస్తాయి? గుండుగుత్తగా పడతాయనే పేరున్న మైనారిటీ ఓట్లు బీజేపీ బలపడిన చోట్ల ఎవరికి పడ్డాయి? నెక్‌టు నెక్ ఎలక్షన్స్‌లో ఇవన్నీ చాలా కీలకం. సర్వే సంస్థలన్నింటికన్నా పెద్ద తీర్పరి ఓటరు. అతని సామూహిక వివేచన (కలెక్టివ్ విజ్‌డం ఆఫ్ ద పీపుల్) మాత్రమే అంతిమ తీర్పు. రేపేం జరగనుందో నిర్ణయం అయిపోయింది (ఫ్యూచర్ హ్యాపెన్డ్). ఈవీఎంలలో ఉన్నదాన్ని మనం తెలుసుకోవడమే తరువాయి. ఎవరి నైపుణ్యాన్నీ కాదనడం లేదు. పైన నేను రాసినట్టుగా కాకుండా ఇంకోరకంగా కూడా జరగవచ్చు. ఎందుకంటే, ఎలక్షన్స్ ఎప్పుడూ అర్థమెటిక్స్ కాదు. అంతకుమించిన కెమిస్ట్రీ!

ఆందోళన కలిగిస్తున్న ఐటీ సంక్షోభం

ఇంజినీరింగ్‌లో సబ్జెక్ట్ ఏదైనా అంతిమంగా ఐటీ జాబ్‌కే అందరూ గురిపెట్టడం మనదేశంలో రివాజుగా మారింది. పట్టా పుచ్చుకుని కాలేజీ నుంచి బైటకు రాగానే ఏదో ఒక టెక్ కంపెనీలో చేరిపోవచ్చనే ధీమా అందుకు కారణం. ఐటీ జాబ్ వస్తే స్థిరమైన కెరీర్‌కు బాటలు పడుతాయి. చక్కటి జీతంతో కార్పొరేట్ జీవితం గడపొచ్చని అనుకోవడం సహజమే. కానీ ప్రస్తుతం ఎంట్రీలెవెల్ జాబ్స్ క్రమంగా తగ్గిపోతున్నాయి. ఈసారి రిక్రూట్‌మెంట్లు పూర్తిగా డోలాయమాన స్థితిలో పడిపోవడంతో వేలమంది ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ల ఆశలపై నీళ్లు చల్లినట్టయింది.

గ్లోబల్ డిమాండ్ తగ్గిపోవడంతో అనేక కంపెనీలు ఫ్రెషర్స్‌ను తీసుకోవడం నిలిపివేశాయి. వాటిలో ఇన్ఫోసిస్, విప్రో వంటి టెక్ దిగ్గజాలు ఉండటం గమనార్హం. మన దేశానికి ఉపాధి కల్పించే రంగాల్లో ఐటీ వాటా 7.5 శాతం వరకు ఉంటుంది. ఐటీ ఉద్యోగాలు పుట్లకొద్దీ చూసిన మనదేశంలో జాబ్స్ కొరత అసాధారణమైన విషయమే. అయితే ఇది కేవలం ఫ్రెషర్స్ సమస్య మాత్రమే కాదు. లక్షల కోట్ల పరిశ్రమలో ఏర్పడుతున్న సంక్షోభానికి ఇది ఒక సూచనగా నిలుస్తుంది. భారతదేశ వృద్ధిపై ప్రభావం చూపి, భారత ఆర్థిక వ్యవస్థను మూడు లక్షల కోట్ల డాలర్ల స్థాయికి తీసుకువెళ్లాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలకు ఇది గండి కొట్టే అవకాశం ఉన్నది. కరోనా కల్లోలం ప్రధానంగా ఉద్యోగాలకు గండిపెట్టింది. అయితే గత రెండేండ్లలో పరిస్థితి మెరుగుపడి ఐటీ కంపెనీలు భారీస్థాయిలో రిక్రూట్‌మెంట్ జరిపాయి. వర్క్ ఫ్రం హోం పద్ధతి రావడం కూడా ఇందుకు దోహదం చేసింది. అగ్రస్థాయి కంపెనీలైన టీసీఎస్, ఇన్ఫోసిస్ దాదాపు 3 లక్షల మంది ఫ్రెషర్స్‌ను తీసుకున్నాయి. ఉక్రెయిన్ యుద్ధం వల్ల ప్రపంచంలో అస్థిర పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రపంచ ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల పెరుగుదల దానికి ఆజ్యం పోశాయి. ఫలితంగా ఐటీ సేవలను ఉపయోగించుకునే కంపెనీలు ఖర్చులను తగ్గించే పనిలో పడ్డాయి. కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత సాధించిన అభివృద్ధి కూడా ఫ్రెషర్స్ ఉద్యోగాలు తగ్గడానికి కారణమవుతున్నది. దీంతో కొత్త ఉద్యోగులను తీసుకోవడం భారీగా తగ్గిపోయింది. నిరుడుతో పోలిస్తే ఫ్రెషర్స్ రిక్రూట్‌మెంట్ మొన్నటి సెప్టెంబర్‌లో 43 శాతం, అక్టోబర్‌లో 14 శాతం తగ్గింది. క్రమం తప్పకుండా క్యాంపస్ రిక్రూట్‌మెంట్ జరిపే పెద్దపెద్ద కంపెనీలు ఈ ఏడాది ముఖం చాటేశాయి. గత అక్టోబర్‌లో ఒక అంచనా ప్రకారం నిరుద్యోగం 10.05 శాతానికి పెరిగింది. ఐటీలో మాంద్యం వస్తే దాని ప్రభావం ఇతర రంగాలపైనా ఉంటుందనేది తెలిసిందే.

ఎన్నికల వేళ ప్రధాని నరేంద్రమోదీకి ఇదొక తలనొప్పిగా మారవచ్చు. ఎందుకంటే కేంద్ర విపక్షాలు దీనిపై హంగామా చేయకుండా ఉంటాయని భావించలేం. నిరుద్యోగులు ఆందోళన బాట పడితే సమస్య చేయిదాటిపోయే ప్రమాదమూ ఉంటుంది. దీనిని పసిగట్టే ప్రధాని మోదీ స్వయంగా ఉపాధి మేళాలకు వచ్చి నియామక పత్రాలు అందజేస్తూ ఇమేజ్ కాపాడుకునేందుకు తంటాలు పడుతున్నారు. ఈ రాజకీయ వ్యవహారాన్ని పక్కన బెడితే ఐటీ రంగాన్ని ప్రస్తుత సంక్షోభం నుంచి బైటపడేసే చర్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నది. సీనియర్లతో కిందిస్థాయి పనులు చేయించడం మానుకొని ఫ్రెషర్స్‌కు అవకాశాలు కల్పించడం అనేది దిద్దుబాటు చర్యల్లో ముఖ్యమైంది. అయితే అందుకు నూతన అవకాశాలను అందిపట్టుకోవడమూ అవసరమేనని చెప్పక తప్పదు.

- ఎడిటోరియల్ డెస్క్

పట్నం ఓటరుకు పట్టిలేదెందుకు?

బుద్దా మురళి

తెలంగాణలో 2018 ఎన్నికల్లో 73 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకుంటే 2023 ఎన్నికల్లో 71 శాతం మంది మాత్రమే తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. అంటే గత ఎన్నికల కంటే ఈసారి రెండు శాతం తక్కువ ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఒకే దేశంలో అనేక దేశాలు అన్నట్టు ఒకవైపు గ్రామీణ ఓటర్లు ఓటు వేయడాన్ని ఒక పండుగగా భావించి ఓటు వేసే, అదే సమయంలో మహానగరాల్లో ఉండే సంపన్నులు, విద్యావంతులు, ఉద్యోగులు ఓటింగ్‌కు దూరంగా ఉండి పోలింగ్ పండుగను ఒక సెలవు దినంగా గడుపుతున్నారు.

గ్రామీణ ఓటర్లు బస్సుల్లో, రైళ్లల్లో వెళ్లి ఓటు వేసివస్తుం టే, నగర ఓటరు కాలు కదపకుండా ఇంటికే పరిమితమవుతున్నాడు. గ్రామీణ ఓటర్లు ఉండే దుబ్బాకలో 84 శాతం పోలింగ్ జరిగితే నగరం నడిబొడ్డున ఉన్న యాకుత్‌పురాలో 39 శాతం మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. దుబ్బాకతో పోలిస్తే సగం మంది కూడా యాకుత్‌పురాలో ఓటు వేయలేదు. ఒక్క యాకుత్‌పురా అని కాదు హైదరాబాద్ నగరంలోని అన్ని నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి.

రాజుగారి ఇంట్లో పెళ్లికి ప్రతి ఒక్కరు బిందెడు పాలు తెచ్చి పోయాలంటే నేనొక్కడినే పాలకు బదులు నీళ్లు పోస్తే ఏం తెలుస్తుందిలే అని అందరికి అందరూ నీళ్లే తెచ్చి పోశారట. చిన్నప్పు డు చదివిన కథలానే నేనొక్కడిని ఓటు వేయకపోతే ఏమవుతుం ది అనుకుంటున్నారా? ప్రజాస్వామ్యం మీద గౌరవం పోయిం దా? ఎవరికోసమో మనం క్యూలో నిలబడి ఓటెందుకు వేయాలి అనుకుంటున్నారా? ప్రధానంగా మహానగరాల్లో పోలింగ్ శాతం ఎందుకు తగ్గుతున్నది.

ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికలు జరిగితే అత్యల్పంగా దాదాపు 26 శాతం ఓటింగ్ జరిగింది. ఆ రోజు క్రికెట్ ఉండడం వల్ల అలా జరిగిందని చెప్పుకొచ్చారు. ప్రతిసారి ఇలా ఏవో కుంటిసాకులతో సర్దుకు పోతున్నారు కానీ సమస్యకు కారణం ఏమిటి? దీనికి పరిష్కారం ఏమిటనే దిశగా ఆలోచన సాగడం లేదు.

ప్రతిసారి ఎన్నికల కమిషన్ ఓటర్లను చైతన్య పరిచే కార్యక్రమాలు చేపడుతుంది. ఓటు వేయాలని సినీనటులు, క్రీడాకారులతో చెప్పిస్తున్నారు. నిజానికి గ్రామీణ ఓటరును చైతన్య పరచాల్సిన అవసరం లేదు. తమ బాధ్యతగా భావించి ఓటు వేస్తారు. మహానగరాల్లోని ఓటర్లను చైతన్య పరచాల్సిన అవసరం లేదు. చాలా చైతన్యవంతులు కానీ ఓటు వేయరు. అది ఓటరు తప్పా? లేక ఎలక్షన్ కమిషన్ తప్పా? అంటే ఎవరిదీ తప్పు కాదు మన ఎన్నికల విధానం, ఓటింగ్ తీరు మారాలి.

కొన్ని దేశాల్లో నిర్బంధ ఓటింగ్ విధానం అమలు చేస్తున్నా రు. మన దేశ పరిస్థితులు వేరు. ఇక్కడ నిర్బంధ ఓటింగ్ సాధ్యం కాదు. ఐతే ప్రభుత్వం అమలు చేసే పథకాలకు ఓటు వేయడానికి లింక్ కలిపితే కొంత ప్రయోజనం ఉండవచ్చు.గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఓటు వేయడాన్ని పండుగ జరుపుకున్నట్టు సంతోషంగా ఓటు వేస్తారు. జాబితాలో తమ ఓటు లేకపోతే తీవ్ర అవమానంగా భావిస్తారు. 1994 ప్రాంతంలో వరంగల్ జిల్లాలో నక్సలైట్ల ప్రభావం చాలా ఎక్కువగా ఉండేది. ఎన్నికల సమయంలో నక్సలైట్లు ఎన్నికలను బహిష్కరించాలని పిలుపునిచ్చేవారు. గ్రామీణులకు ఆ కాలంలో నక్సలైట్ల మాట అంటే చాలా గురి. భయంతో పాటు వారంటే అభిమానం కనిపించేది. ఆ సమయంలో మీడియా బృందం మారుమూల గ్రామాల్లో పర్యటించి ఎన్నికల బహిష్కరణ గురించి ఏమనుకుంటున్నా రు? అని ఆరా తీస్తూ ‘నక్సలైట్లు ఓటింగ్‌లో పాల్గొనవద్దు, ఎన్నికలను బహిష్కరించమని చెబుతున్నారు కదా? మరి మీరు ఓటు వేస్తారా?’ అని అడిగినప్పుడు పల్లె జనం ‘ఓటు వేయకుండా ఉండేందుకు మేమేమన్న చచ్చిపోయామా? ఓటు వేసి తీరుతాం, వేయవద్దు అని చెప్పడానికి వాళ్లెవరు’ అని ధైర్యంగా బదులిచ్చారు. ఓటు వేయక పోవడం అనేది గ్రామీణుల దృష్టిలో చనిపోవడం లాంటిది. అదే మహానగరాల్లో పెద్ద వారికి ఓటు వేయడం అంటే నామోషీ. అందరితో సమానంగా ఓటు వేయడం ఏమిటీ అనుకుంటారు. కొంత మంది నటులు బాధ్యతగా ఓటు వేసినా చాలామంది నటులు పోలింగ్‌కు దూరంగానే ఉన్నారు.

మనది నిర్బంధ ఓటింగ్ విధానం కాదు. నిర్బంధ ఓటింగ్ విధానం అమలు కూడా మన దేశంలో సాధ్యం కాదు. దానికి బదులు కొన్ని సంస్కరణలు తీసుకురావడం ద్వారా ప్రతి ఒక్కరు ఓటు వేసే విధంగా చూడవచ్చు. టెక్నాలజీ ఎంతో పెరిగింది. ఓట్ల పండుగకు దీనిని ఉపయోగించుకోలేరా?

మహానగరాల్లో ఓటర్లు ఇంట్లో ఉండి పోవడం వల్లనే ఓటింగ్ శాతం తక్కువగా ఉంటుంది అనే వాదన నిజం కాదు. పల్లెల్లో పరిస్థితి వేరు. నగరాల్లో అద్దె ఇండ్లల్లో నివసిస్తారు. తరుచుగా ఇల్లు మారుతుంటారు. ఒక ఇంట్లో ఉన్నప్పుడు ఆ అడ్రస్‌తో ఓటు ఉంటుంది. మరో ఇంటికి వెళ్లినప్పుడు ఓటు గురించి పట్టించుకోరు. ఆధార్ కార్డు, పాన్ కార్డు వంటి వాటిని అన్నింటికీ ఉపయోగిస్తారు కాబట్టి అడ్రస్ మారగానే రేషన్‌కార్డు, పాన్‌కార్డు, ఆధార్ కార్డు మార్పించుకుంటున్నారు కానీ ఓటరుకార్డు గురించి పెద్దగా పట్టించుకోరు. ఓటరుకార్డు ఉన్నా ఒకటే లేకపోయినా ఒకటే, ఓటు వేసినా, వేయకపోయినా ఒకటే అని పట్టించుకోరు. ఆధార్, పాన్‌కార్డు ఒకసారి తీసుకుంటే అడ్రస్ మారుతుంది తప్ప ఆ కార్డు శాశ్వతం. అదే విధంగా ఓటరు కార్డును శాశ్వతంగా ఉండేట్టు చేయాలి. దేశంలో ఉన్న 140 కోట్ల మందికి ఆధార్ కార్డు ఇవ్వగలిగినప్పుడు వారికి శాశ్వతమైన ఓటరు కార్డు ఇవ్వలేరా ? అడ్రస్ మారినప్పుడల్లా అడ్రస్ మార్చుకోవచ్చు కానీ కార్డు ఒకటే ఉండాలి. అదే విధంగా ఆధా ర్, పాన్, ఓటర్ కార్డు లింక్ చేయడంతో పాటు తప్పనిసరి చేయాలి. సంక్షేమ పథకాలతో పాటు రేషన్ కార్డుకు ఓటరు కార్డు తప్పనిసరి చేయాలి .

విదేశాల్లో ఉన్న భారతీయులకు మన దేశ పౌరసత్వంతో పాటు ఓటు హక్కు కూడా ఉండాలి అనే చర్చ చాలా కాలం నుంచి సాగుతోంది. విదేశాల్లో ఉన్నవారికి ఆన్‌లైన్ లో ఓటువేసే సౌకర్యం కల్పించే విషయం ఎలా ఉన్నా ఒకే నగరంలో ఇల్లు ఖాళీ చేసి మరో ఇంటికి వెళ్లిన వారు తక్షణం ఓటరు కార్డులో అడ్రస్ మార్చుకొనే సౌకర్యం ఉండాలి.

ఇతర రాష్ట్రాల్లో , ఇతర దేశాల్లో ఉద్యోగం చేసేవారు, చదువుకోవడానికి వెళ్లిన వారి పేర్లు నగరానికి చెందిన ఓటర్ల జాబితాలో ఉంటాయి కానీ వారు ఇక్కడ ఉండరు. దీనివల్ల ఓటింగ్ శాతం తక్కువ కనిపిస్తుంది. ఇతర రాష్ట్రాల్లో , దేశాల్లో తాత్కాలికంగా ఉన్నవాళ్లు ఓటు కోసం రాలేక పోవచ్చు. కనీసం అలాంటివారికైనా ఆన్‌లైన్‌లో ఓటు వేసే అవకాశాలను పరిశీలించాలి. టెక్నాలజీ ఇంతగా అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో దీన్ని అమలు చేయడం పెద్ద కష్టమేమీ కాదు. మరోవైపు ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు ఉన్నా పట్టించుకోవడం లేదు. తెలంగాణలో ఓటు వేసిన వారు ఆంధ్రలోనూ ఓటు వేయడానికి సిద్ధం అవుతున్నారు. రెండు రాష్ట్రాల్లోనే కాదు ఒకే నగరంలో ఒకటికన్నా ఎక్కువ చోట్ల ఓటు ఉన్నవారు కూడా ఉన్నారు. ఆధార్‌ను తప్పనిసరి అనుసంధానం చేయడం ద్వారా దీన్ని నివారించవచ్చు. ఒకే ఆధార్ కార్డు ఉన్నట్టే ఒకటే ఓటర్ కార్డు ఉండేటట్టు చేయాలి.

ప్రతి ఎన్నికల్లో సినిమా వారి చేత మీ ఓటు విలువైనది ఓటు వేయండి అని చెప్పి చేతులు దులుపుకొంటే ఆ ప్రచారం ఒక తంతుగానే నిలుస్తుంది కానీ ప్రయోజనం ఉండదు. నిజానికి అలా ప్రచారం చేసే నటులు ఓటు వేస్తారా? అని అనుమానం. హైదరాబాద్ ఓటర్లు పోలింగ్ రోజు ఇంటికే పరిమితమవుతున్నారు అనే విమర్శకన్నా.. ఎలక్షన్ కమిషన్ నగరంలో ఓ నాలుగైదు అపార్ట్‌మెంట్‌లను ఎంపిక చేసుకొని... ఆ అపార్ట్‌మెంట్లో ఎన్ని ఓట్లు ఉన్నాయి ? ఎన్ని పోలయ్యాయి. సగం మంది ఓటు వేయక పోవడానికి కారణం ఏమిటి అని ఓ సర్వే చేస్తే వాస్తవాలు తెలుస్తాయి. ఇంట్లో ఉండి ఓటింగ్‌కు దూరంగా ఉండేవాళ్ళు ఎవరూ ఉండరు. మరి పోలింగ్ ఎందుకు తక్కువవుతున్నదంటే ఈ చిన్న సర్వేతో అసలు విషయం తెలుస్తుంది. ఐదారు అపార్ట్‌మెంట్స్ నుంచి సమాచారం సేకరించడం పెద్ద కష్టమేమీ కాదు. కారణాలు తెలిసినప్పుడు వాటికి పరిష్కారం ఆలోచించవచ్చు. టెక్నాలజీని ఉపయోగించుకొని ఓటింగ్ శాతాన్ని పెంచుకోవచ్చు.

ఎటమటం

ఎవని పెండ్లికి ఇస్తవు?

ఎన్నికల్లో డబ్బులు పంచడాన్ని ఓటర్లు తమ హక్కుగా భావిస్తున్నారు. డబ్బులు ఇస్తే తప్ప ఓటు వేయననే పరిస్థితి వచ్చింది. అది కూడా పదోపరకో ఇస్తే పుచ్చుకునే ప్రసక్తేలేదని తిరస్కరిస్తూ..ఫలానా ఎన్నికలలో ఇంత ఇచ్చారు...ఫలానా చోట అంత ఇచ్చారని రేట్లు కనుక్కొని మరీ డిమాండ్ చేస్తున్నారట. ఒకవేళ తక్కువిస్తే, ఎవని ముక్కుల పెడుతవు... ఎవని పెండ్లికి ఇస్తవు....పుణ్యానికి ఇస్తున్నవా? అని నిష్ఠూరంగా మాట్లాడటం టీవీలో చూశాం. మరీ విడ్డూరమేమిటంటే డబ్బుల కోసం అభ్యర్థులను ఘెరావ్ చేసిన ఉదంతాలూ జరిగాయి. ఒక ఊర్లో అయితే తమకు ఏ పార్టీ డబ్బులు పంచలేదన్న కోపంతో ఊరుఊరంతా ఏకమై ర్యాలీగా వెళ్లి ‘నోటా’కు ఓటు వేసి వచ్చారు. ఇలా ఉంటే ఉపఎన్నికలు జరిగిన చోట్ల మరో విచిత్రమైన పరిస్థితి. హుజూరాబాద్, మునుగోడులో రెండేండ్లు, ఏడాది టర్మ్‌కే ఓటుకు 6 వేలు ఇస్తే, ఐదేండ్ల టర్మ్‌కు 5 వందలే ఇస్తావా? అని ముఖం మీదనే జనాలు డబ్బులు విసిరి కొట్టారట. ఎంతైనా ఆ గోల్డెన్ డేస్ మళ్లీ రావు...ఇంటింటికి మందు, చికెన్, మటన్...వేలలో డబ్బులు... అంటూ అప్పటి వారు ఏవి తల్లి నిరుడు కురిసిన హిమసుమాలు అంటూ ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్లారట.

ఏ పార్టీకి ఓటేశావు షర్మిలక్కా?

క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకున్నట్టు షర్మిలక్క ప్రకటించినప్పటికీ జనాలు మాత్రం ఆమెను ఓ పట్టాన వదిలిపెట్టడం లేదు. పోలింగ్ రోజు ఓటు వేసిన ఫొటో ఆమె సోషల్ మీడియాలో ఇలా పోస్టు చేసిందో లేదో కాచుకు కూర్చున్న నెటిజన్లు కయ్యిమని లేచారు. ఇంతకు ఏ పార్టీకి ఓటేశావక్కా? అని నిలదీసారు. ఓహో కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్టు ముందే ప్రకటించావు కదా, దానికే వేసి ఉంటావు లే అన్నారు. మరి కొందరైతే ఒక పార్టీకి అధ్యక్షురాలిగా ఉండి ఇంకో పార్టీకి ఓటు వేయడం ఏమిటి? అని నిలదీశారు. నీ కంటే బర్రెలక్క నయం...ధైర్యంగా ఎన్నికలలో పోటీ చేసింది అంటూ మరి కొందరు దెప్పిపొడిచారు. మేడమ్‌ను ఎన్ని అయినా అనండి... కానీ ఆ బర్రెలక్కతో మాత్రం పోల్చకండి ప్లీజ్ అని జై షర్మిలక్క బ్యాచ్ రిక్వెస్టు చేయడం కొసమెరుపు.

-వెల్జాల